క్లుప్తంగా

మురుగునీరు నిల్వకుండా చర్యలు



నీరు నిల్వకుండా ఇసుక పోస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కోటపల్లి: మండలంలోని జనగామ ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట మురుగు నీరు నిలిచి బురదతో విద్యార్థులు, కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని 'రోడ్డుపై గుంతలు.. ప్రజల అవస్థలు' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా ఎంపీవో అక్తర్ స్పందించారు. గ్రామపంచాయితీ సిబ్బందితో మంగళవారం పాఠశాల ఎదుట నిలిచిన బురదను తొలగించి, నీరు నిల్వ ఉండకుండా ఇసుక పోసి చదును చేయించారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేసి కష్టాలు తీర్చిన 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

పంటలసాగుపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న శివకృష్ణ

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లిలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారిని కళ్యాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సాగుపై కృషి విజ్ఞాన కేంద్రం(బెల్లంపల్లి)కో ఆర్డినేటర్ డాక్టర్ శివకృష్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రసాద్, బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ప్రియసుగంధి, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త తిరుపతి, పంట ఉత్పాదక శాస్త్రవేత్త కిరణ్మయి, ఉద్యానవన శాఖ అధికారులు, విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు ఉపాధి నైపుణ్యతపై శిక్షణ

బెల్లంపల్లి/మంచిర్యాలఅర్బన్: సాంఘిక సంక్షేమ గురుకులంలో చదువుకొని ఉద్యోగం పొందలేని పూర్వ విద్యార్థులకు ఉపాధి నైపుణ్యాలను పెంచే లక్ష్యంతో యూఎస్ఎక్స్‌టీ సంస్థ ఆధ్వర్యంలో 30రోజుల పాటు వృత్తి నైపుణ్యంపై శిక్షణ ఇవ్వనున్నట్లు మంచిర్యాల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం జోనల్ ఆఫీసర్ జోన్–1 అరుణకుమారి, తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల పాఠశాల /కళాశాల ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల, కళాశాలల్లో పది, ఇంటర్, డిగ్రీ చదువుకొని ఐటీఐ, పాలిటెక్నిక్ చేసి నిరుద్యోగులుగా ఉన్నా 18నుంచి 25 సంవత్సరాల వయస్సు కలిగిన పూర్వ విద్యార్థులందరూ శిక్షణకు అర్హులన్నారు. ఈ నెల 30లోపు తమ వివరాలను అందుబాటులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

సీపీఐ మహాసభలు జయప్రదం చేయండి

రామకృష్ణాపూర్: వచ్చే నెల 1న నిర్వహించనున్న సీపీఐ పార్టీ పట్టణ మూడో మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్ కోరారు. మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలోని రాజీవ్‌చౌక్‌లో మంగళవారం కరపత్రాలు పంపిణీ చేశారు. నూతన కార్యవర్గం ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నక్క వెంకటస్వామి, పాల్, గోపి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న కార్మికులు, నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఏఐటీయూసీ నాయకులు, కాంట్రాక్టు కార్మికులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్మికులకు యూనిఫాం ఇవ్వాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, కార్యవర్గ సభ్యులు లింగం రవి, కార్మికులు రాయమల్లు, నర్సయ్య, సువర్ణ, లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

'రైతునేస్తం' విస్తరణ



రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న వ్యవసాయ అధికారులు

- కొత్తగా 26 వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం
- అన్నదాతకు మరింత చేరువగా కార్యక్రమాలు..
- నిర్వహణ నిధులు రాక ఇబ్బంది పడుతున్న ఏవోలు, ఏఈవోలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా 26 కొత్త రైతువేదికలను వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా మార్చనున్నారు. ఈ వేదికలు రైతులకు సాగు సలహాలు, పంట తెగుళ్లపై అవగాహన కల్పించడంలో కీలకం. అయితే, మూడేళ్లుగా నిర్వహణ నిధులు లేకపోవడంతో మండల వ్యవసాయాధికారులు (ఏవో), వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవో)లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదనపు వేదికల ఏర్పాటుతో ఏవోలు, ఏఈఓలపై మరింత భారం పడనుంది.

నిధుల కొరత

గత ప్రభుత్వం రైతుల కోసం రైతువేదికలు నిర్మించింది. ఒక్కో రైతువేదికకు రూ.1.20 కోట్లు కేటాయించింది. జిల్లాలో 55 క్లస్టర్ల పరిధిలో 55 రైతు వేదికలు నిర్మించింది. నెలవారీ నిర్వహణకు పరిశుభ్రత (రూ.3 వేలు,), శిక్షణ (రూ.2,500), స్టేషనరీ (రూ.1,000), విద్యుత్ (రూ.1,000), మరమ్మతులు (రూ.1,000), తాగునీరు (రూ.500) చొప్పున రూ.9 వేలు కేటాయించింది. అయితే 2022 సెప్టెంబర్ నుంచి నిధులు నిలిచిపోయాయి. దీంతో ఏవోలు, ఏఈవోలు సొంత ఖర్చులతో ప్రస్తుతం రైతువేదికలను నిర్వహిస్తున్నారు.

ప్రస్తుత పనితీరు

రైతువేదికలు ప్రస్తుతం ఏఈవో కార్యాలయాలు, వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా పనిచేస్తున్నాయి. ఏఈవోలు ఉదయం 9 గంటలకు వేదికల వద్ద రైతుల సమస్యలను పరిష్కరిస్తారు. క్షేత్రస్థాయిలో పొలాలను సందర్శిస్తారు, మధ్యాహ్నం తిరిగి సలహాలు అందిస్తారు. అయితే, నిధుల లేమితో పరిశుభ్రత, సౌకర్యాల నిర్వహణ కష్టతరంగా మారింది.

క్లస్టర్ విస్తరణ

రైతునేస్తం కార్యక్రమాలు ఇప్పటివరకు మండల కేంద్రాల్లో నిర్వహించగా, ఇకపై ప్రతీ మండలంలో రెండు అదనపు క్లస్టర్‌లకు విస్తరిస్తున్నారు, రైతులకు సమీప సేవలను అందిస్తాయి. ఈమేరకు ఆయా వేదికల్లోనూ వీడియో కాన్ఫరెన్స్ పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రైతులకు సాగు పద్ధతులు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తారు.

జిల్లా వివరాలు..

మండలాలు	16
రెవెన్యూ గ్రామాలు	385
గ్రామ పంచాయతీలు	306
వ్యవసాయ డివిజన్లు	05(మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, భీమిని, జన్నారం)
క్లస్టర్లు	55
రైతు వేదికలు	55
ఏఓలు	18
ఏఈవోలు	55
రైతులు	3, 24,237
సాగు విస్తీర్ణం	3.50,205 ఎకరాలు

కొత్త వేదికల విస్తరణ..

ప్రస్తుత జిల్లాలో 16 రైతు వేదికలు వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా ఉన్నాయి. ప్రతీ మంగళవారం ఈ వేదికల్లో రైతునేస్తం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మిగతా రైతులకు కూడా రైతునేస్తం అందుబాటులోకి తెచ్చేందుకు కొత్తగా 26 వేదికలను వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లాలో వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాల సంఖ్య 42కు పెరగనుంది. రైతు నేస్తం సేవలు మరింత మంది రైతులకు అందుబాటులోకి రానున్నాయి. కొత్తగా మంచిర్యాల డివిజన్ పరిధిలోని వెంకట్రావుపేట, సురారం(లక్సెట్టిపేట), ర్యాలీ, దొనబండ(హాజీపూర్), ముత్యంపేట, గూడెం (దండేపల్లి), జన్నారం డివిజన్ పరిధిలోని చింతగూడ, తిమ్మాపూర్(జన్నారం), చెన్నూర్ డివిజన్ పరిధిలోని బొక్కలగుట్ట(మందమర్రి), చెన్నూర్, అంగ్రాజ్‌పల్లి(చెన్నూర్), జైపూర్, కుందారం(జైపూర్), దేవులవాడ, మల్లంపేట(కోటపల్లి), భీమిని డివిజన్ పరిధిలోని జన్కాపూర్, మెట్‌పల్లి(కన్నెపల్లి), నెన్నెల, జోగాపూర్(నెన్నెల), నీల్వాయి(వేమనపల్లి), రాంపూర్, కేస్లాపూర్(భీమిని), బెల్లంపల్లి డివిజన్ పరిధిలోని ధర్మారావుపేట(కాసీపేట), రేచిని, కిష్టంపేట్(తాండూర్), గురిజాల(బెల్లంపల్లి) వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయనున్నారు.

మరో 26 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్..



జిల్లాలో క్లస్టర్లవారీగా రెండు రైతువేదికలను కలిపి కొత్తగా 26 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరింతమంది రైతులకు సాగు ప్రయోజనాలు అందనున్నాయి. వేదికల నిర్వహణకు మూడేళ్లుగా నిధులు రావడం లేదు. దీంతో ఏవోలు, ఏఈవోలపై భారం పడుతోంది. నిధుల కోసం పూర్తి నివేదిక ప్రభుత్వానికి అందించాం.

– కల్పన, జిల్లా వ్యవసాయాధికారి

ఫీజు చెల్లింపు జీవో 6 వెంటనే రద్దు చేయాలి



ఆర్డీవో హరికృష్ణకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: ఎస్సీ విద్యార్థుల ఫీజు చెల్లింపునకు సంబంధించిన జీవో నంబర్ 6ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు, మాదిగ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలువల అనిల్‌కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట జీవో రద్దు కోసం నిరసన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీవో హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దుర్గయ్య, రమేశ్, నారాయణ, రాజ్‌కుమార్, నవీన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలని ధర్నా



ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాసిపేట: మండలంలోని కొండాపూర్‌యాపలో రోడ్డు మరమ్మతు చేపట్టాలని మంగళవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చంద్రయ్య, అగ్గి సత్యం, వాసుదేవ్, కొండబత్తుల రాంచందర్, మంజులరెడ్డి, కార్యకర్తలున్నారు.

పోడు రైతులకు బ్యాంకు రుణాలివ్వాలి



నిరసన తెలుపుతున్న పోడురైతులు

కోటపల్లి: పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తూ, పట్టాలున్న ఆదివాసీలకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మపున్నం డిమాండ్ చేశారు. సిర్సా గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట పోడు రైతులతో కలిసి మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు మడే సుమలత, జిల్లా నాయకులు శ్రావణ్, ముత్తయ్య, చిన్నన్న, లచ్చయ్య, సమ్మయ్య, సమ్మయ్య, రామక్క, సంపత్, శ్రీను, బాపు పాల్గొన్నారు.

సిబిల్‌స్కోర్ ఆధారంగానే రుణాలు మంజూరు

భీమారం: రాజీవ్ యువవికాసం రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సిబిల్ స్కోర్ ఆధారంగానే రుణాలు మంజూరు చేయనున్నట్లు ఎంపీడీవో మధుసూదన్ తెలిపారు. మండలవ్యాప్తంగా 11గ్రామపంచాయతీల్లో 1230మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వారి వివరాలను ఆయా బ్యాంకులకు పంపించినట్లు తెలిపారు. అర్హత గల వారికి రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

● **గోవధ కేంద్రాలు మూసివేయాలని వినతి**

జన్నారం: మండలంలోని గోవధ కేంద్రాలను మూసివేయాలని హిందూవాహిని సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కేంద్రాలను మూసివేసి హిందువుల మనోభావాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో హిందూ వాహిణి సంస్థ సభ్యులు నాగేశ్వర్, శ్రీధర్, సత్తన్న, గంగాధర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

● **అట్రాసిటీ కేసు నమోదు చేయాలి**

వేమనపల్లి: చామనపల్లి శివారులోని 65, 67సర్వే నంబర్‌లలో పట్టాలు ఉన్న రైతులు సోమవారం రాత్రి బీజేపీ రాష్ట్ర నాయకులు కొయ్యల ఏమాజీ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మున్నరాజ సిసోడియా, చామనపల్లి గ్రామస్తులు నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్యాంపటేల్‌కు ఫిర్యాదు అందజేశారు. నీల్వాయి అటవీ రేంజ్ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలతో భూములను సాగు చేయనివ్వడం లేదని, గతేడాది 9 మంది దళిత గిరిజనులపై కేసులు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులైన అటవీ బీట్ అధికారుల స్థాయి నుంచి డీఎఫ్ఓ వరకు అందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సాగు భూముల్లో సేద్యం చేసుకునేందుకు అనుమతించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో దుర్గం బానయ్య, లింగయ్య, పర్వతాలు, మధుకర్, సతీష్, రాజయ్య, ముక్తయ్య, కృష్ణ, బీజేపీ జిల్లా నాయకులు దుర్గం ఎల్లయ్య ఉన్నారు.

● **విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు**

దండేపల్లి: రైతులు పంట పొలాలు, చేల చుట్టూ అటవీ జంతువుల కోసం విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తహసీనొద్దీన్ హెచ్చరించారు. విద్యుత్ తీగలు అమర్చకుండా కంచెలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

● **'ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతారా'**

చెన్నూర్: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఎప్పుడిస్తారా అని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే, అక్రమ కేసులు పెట్టి కోర్టుకు లాగుతారా అని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. ప్రజల కోసం ఎన్ని కేసులు పెట్టినా వెనుకడుగు వేసేదిలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాలిపల్లి రవి, కముటం మనోహర్, ఎండీ నాయబ్, షంషీర్, రెవెల్లి రాజు, బొగె భారతి, సుద్దాల ప్రశాంత్, రెవెల్లి మహేశ్ పాల్గొన్నారు.

● **ముందస్తు అరెస్ట్**

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలోని మాజీ సర్పంచులను హాజీపూర్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్ సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో ముట్టడి కార్యక్రమాన్ని కట్టడి చేసేందుకు హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచులు గోళ్ల శ్రీనివాస్, ఆనె మల్లేశ్, జాడి సత్యంను ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

● **ఆటో డ్రైవర్ల మహాసభ విజయవంతం**

పాతమంచిర్యాల: హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మంగళవారం నిర్వహించిన చలో హైదరాబాద్–ఆటో డ్రైవర్ల ఆకలికేక మహాసభ విజయవంతమైనట్లు రాష్ట్ర ఆటో జేఏసీ ప్రణాళిక చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. సభకు రాష్ట్రం నలుమూలల నుంచి ఆటో కార్మికులు స్వచ్ఛందంగా హాజరై విజయవంతం చేసినట్లు తెలిపారు.

● **అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి**

మందమర్రిరూరల్: మండలంలోని అందుగులపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి నిర్మాణాల కోసం అనుమతులు తీసుకొని, కొంతమంది మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణాలు చేపటారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. అలాంటి నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని మంగళవారం తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఆయన వెంట బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు గాజుల శంకర్, మండల అధ్యక్షుడు ఎండీ మతీన్‌ఖాన్ ఉన్నారు.

● **రక్తకణాలు దానం**

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆస్పత్రిలో మందమర్రికి చెందిన ఫాతిమా మూడు రోజుల క్రితం ఆడ శిశువు జన్మనిచ్చింది. శిశువుకు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తకణాలు అవసరం కాగా రాజీవ్‌నగర్‌కు చెందిన మహ్మద్ అమాన్ ముందుకొచ్చాడు. అత్యవసర సమయంలో రక్తకణాలు అందించి పాపను ప్రాణాపాయం నుంచి కాపాడిన మహ్మద్ అమాన్‌ను పలువురు అభినందించారు.

● **పాఠ్యపుస్తకాలు పంపిణీ**

దండేపల్లి: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్ పాఠశాలలకు ఉచిత పాఠ్యపుస్తకాలను మంగళవారం ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది పంపిణీ చేశారు. పాఠశాలల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పుస్తకాలను అందించారు. ఎంఐఎస్ నగేశ్, సీసీవో మల్లేశ్, సీఆర్పీలు నర్సయ్య, సురేందర్, రమేశ్, శ్రావణ్, మెసెంజర్ మల్లేశ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శనిగకుంట నీరు వృథాయేనా..!

- మత్తడి పునర్నిర్మాణంపై నిర్లక్ష్యం
- వర్షాలు పడితే నీరు నిలువదు



ధ్వంసమైన చెన్నూర్ శనిగకుంట మత్తడి

చెన్నూర్: చెన్నూర్ పట్టణ సమీపంలోని 63వ జాతీయ రహదారి పక్కన శనిగకుంట 33.22 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఆయకట్టు కింద 40 ఎకరాలు సాగవుతుంది. గతేడాది కుంట మత్తడి పేల్చివేయడంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఏడు నెలలైనా పునర్నిర్మాణానికి నోచుకోవడం లేదు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు నష్టపోయారు. ఈ ఏడాదైనా పంట సాగు చేసుకుందామని రైతులు ఆశపడితే నేటికీ నిర్మాణం చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మత్తడిని 2024 సెప్టెంబర్ 16న కొందరు రియల్టర్లు పేల్చివేసిన విషయం తెలిసిందే. మత్తడి పేల్చివేతకు కుట్ర జరుగుతోందని అదే ఏడాది సెప్టెంబర్ 13న పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. పేల్చివేత కారణంగా నీరంతా వృథాగా పోవడంతోపాటు రైతులు, మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారు. వచ్చే వర్షాకాలంలో కుంటలో నీరు నిలిచే అవకాశం లేకుండా పోయింది. మత్తడి పునర్నిర్మాణానికి రూ.4లక్షలు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తి కాగా కాంట్రాక్టర్‌తో ఒప్పందం జరిగింది. అయినా అధికారులు పనులు ప్రారంభించకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం రాకముందే మత్తడి నిర్మించాలని, లేనిపక్షంలో ఆయకట్టు రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. చెన్నూర్ ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌ను సంప్రదించగా.. వర్షాకాలం రాకముందే పనులు పూర్తి చేయాలని ఆదేశించామని, త్వరలోనే పనుల ప్రారంభానికి కృషి చేస్తామని తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి



రిజిస్టర్లు పరిశీలిస్తున్న ఏడీఏ సురేఖ

వేమనపల్లి: విత్తన దుకాణాల్లో నాణ్యమైన పత్తి, వరి విత్తనాలు అందుబాటులో ఉంచాలని భీమిని ఏడీఏ సురేఖ అన్నారు. మండల కేంద్రంతో పాటు గొర్లపల్లి గ్రామపంచాయతీలలోని పురుగు మందులు, విత్తన దుకాణాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. అధిక ధరలకు విత్తనాలు అమ్మకూడదన్నారు. బిల్లు, స్టాక్ రిజిస్టర్ మెయింటెన్ చేయాలని డీలర్లకు సూచించారు. అనంతరం నీల్వాయి రైతు వేదికలో రైతులతో మాట్లాడారు. ఫార్మర్ రిజిస్ట్రీలో ప్రతీ రైతు పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఆమె వెంట ఎంఏఓ వీరన్న, ఏఈఓలు రుక్సార్ సుల్తానా, హెప్సీబాలు ఉన్నారు.

వెలగని వీధిదీపాలు



భీమారం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నెల రోజుల నుంచి వీధిదీపాలు వెలగడంలేదని స్థానిక ప్రజలు తెలిపారు. రాత్రివేళ చాలా ఇబ్బంది పడుతున్నామని, భయటికెళ్లాలంటే జంకుతున్నట్లు తెలిపారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని వీధిదీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సామాజిక తనిఖీ బృందాలకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల పరిధిలో 2024–25ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీల బృందం గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ తనిఖీలు చేస్తారని ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. హాజీపూర్ ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలు సహకరించాలని సూచించారు. సమావేశంలో ఈజీఎస్ ఎస్ఆర్పీ శైలు, ఏపీఓ మల్లయ్య, ఈసీ శ్రీనివాసరెడ్డి, డీఆర్పీలు, వీఎస్ఏలు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు, మేట్లు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులను అభినందిస్తున్న వాకర్స్

బెల్లంపల్లి: జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన బెల్లంపల్లి క్రీడాకారులను సింగరేణి తిలక్ స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్, ఏకదంత మిత్రమండలి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని క్రీడా పోటీల్లో పాల్గొని సత్తా చాటాలని ఆకాంక్షించారు. టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, వాకర్స్ అసోసియేషన్ నిర్వాహకులు జయరాం, నాగేశ్, గోవర్ధన్, రాజన్న, సంతోశ్, ఏకదంత మిత్ర మండలి నిర్వాహకుడు శ్రీనివాస్, సభ్యులు, తల్లిదండ్రులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

జన్నారం: మండలంలోని మురిమడుగు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2007–08సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కుటుంబయోగ క్షేమాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులను ఆహ్వానించి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, తిరుపతి, సులోచన, భూపతిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట సీఐగా రమణమూర్తి

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట పట్టణ సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్‌గా రమణమూర్తి బదిలీపై ఇక్కడకు వచ్చారు. బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇది వరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన నరేందర్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు.